


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మొహమాటానికి పోతే...

అతి మొహమాటానికి పోతే.. అని ఓ ముతక సామెత ఉంది. అస్సలు ఈ సామెతలన్నీ వినగానే మనం నవ్వుతూ తీసి పారేస్తాం కానీ ఎవరో అనుభవజ్ఞులు జీవిత సారాన్ని వడగట్టి తయారు చేసారని నాకు అనిపిస్తుంటుంది. ఎన్నోసార్లు మనం ఈ మొహమాటం అనే జాడ్యం బారినపడి చాలా చాలా కష్టపడుతూ, చాలా చాలా నష్టపడుతూ ఉంటాం. ఈ విషయం గురించి మాట్లాడాలంటే ముందు మా శాంతక్కాయ్ గురించి చెప్పి తీరాల్సిందే! డెఫినెట్‌గా అది ఈ ఫీచర్ చదివి నా మీద అలుగుతుంది. కానీ కోపం తెచ్చుకోడానికి మొహమాటపడి ఊరుకుంటుంది.

దానికి ఎంత మొహమాటం అంటే, చిన్నప్పటి నుండీ ఇంటెడు చాకిరీ చేసేది. ఏ పక్కింటి అత్తయ్యగారో తన కోడలి మీద నేరాలు చెప్పుకోడానికొచ్చి గంటల తరబడీ చెపుతుంటే తల నొప్పి వచ్చినా లేచి లోపలికెళ్ళలేక పోయేది. పైగా అవిడకి కాఫీ, ఫలహారాలు లాంటివి క్రమం తప్పకుండా అందించేది. దానితో పాటే దాని మొహమాటమూ పెరిగి పెద్దదయింది.

ముష్టివాడొస్తే అన్నం, ఆవకాయా వేసి, "పాపం కారం పెడుతుందేమో" అని నెయ్యి వేసిన ఘనత మా అక్కదే!

ఇంటావిడ పెంచుకున్న ఆరేళ్ళ కూతుర్ని, ఆవిడ రోగిష్టి తల్లినీ, అద్దెకున్న పాపానికి ఏడాది పాటు, ఏ పేరంటానికీ, బంధువులింటికీ వెళ్ళకుండా చూసుకున ఘనచరిత్ర దీనిదే!

ఇంత మొహమాటం, ఇంత ఓర్పూ ఉండడం వల్లే దానికి చిన్నప్పుడే విపరీతమైన తలనొప్పి, కళ్ళజోడూ వచ్చేసాయి. ఒకనాడు మండుటెండలో మా ఇంటికొచ్చి, మధ్యాహ్నం పూట నిద్రపోతున్నారేమో, తలుపు కొడితే ఎలా అని గంటన్నర పాటు వాకిట్లో తల మండిపోతూ కూర్చుంది!

అది ఉండేది ఎపార్ట్‌మెంట్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్. ఏ సేల్స్ గర్ల్ వచ్చినా, మొత్తం అపార్ట్‌మెంట్స్‌లో ఎవరికి కొరియర్ వచ్చినా, ఎవరింటికి ఏ చుట్టం వచ్చి ఎడ్రెస్ కనుక్కోమన్నా, ముందు దీని ఇల్లే కనిపిస్తుంది. నిమిషం నడుం వాల్చడానికి ఉండదు.

ఒకసారి అది కాలేజీకి వెళుతుండగా కండక్టర్ టిక్కెట్ ఇవ్వలేదు. ఇది కొంచెం ధైర్యం చేసి "నా టికెట్" అని అడిగితే,

"ఇస్తానమ్మా... జరవుండు" అన్నాడట. ఇది మళ్ళీ నోరు తెరవలేదు. ఇంతలో చెకింగ్ వాళ్ళు వచ్చి పట్టుకుని పెనాల్టీ వేసారు. హోటల్‌కి వెళితే టిఫిన్ తిని సర్వర్‌ని మంచినీళ్ళు అడగటానికి మొహమాటపడి ఎక్కిళ్ళతో ఇంటికొచ్చింది ఇంకోసారి.

ఎప్పుడైనా మా ఫోన్ మోగి మళ్ళీ ఆగిపోయి, మోగితే "మొహమాటంగా మోగుతోంది.. శాంతక్కే" అనుకుంటాం.

అది ఫోన్ చేస్తే కంగారుగా, "డిస్టర్బ్ చేసానా? ఫోన్ పెట్టెయ్యనా? ఫర్వాలేదా? ఇంకోసారి చెయ్యనా?" అని రెండు నిమిషాలు తెగ మొహమాటపడి తర్వాత టాపిక్‌లోకి వస్తుంది.

అది చాలా ఇళ్ళల్లో అద్దెకుండి స్వంత ఇంటికి వచ్చింది. దీని మొహమాటాన్ని కనిపెట్టి ఇరుగు పొరుగుల వాళ్ళు చాలా పనులు చేయించుకునే వాళ్ళు! ఒకసారి పై ఇంటావిడ పిలిచి మతబోధ ఆపకుండా అవిరామంగా నాలుగు గంటలు చేస్తే పిచ్చి మొద్దు స్పృహ తప్పిపడిపోయింది కూడానూ!

అన్నీ దీనికే అవుతాయి అన్నట్లు ఒకసారి వీళ్ళ వాకిట్లో యురేకా ఫోర్బ్స్ అబ్బాయి బ్యాగ్ స్కూటర్ మీదెళుతూ పారేసుకున్నాడు. ఇది చూసి జాగ్రత్త పెట్టింది. అది ఓపెన్ చేసి చూస్తే ఐదారువేల ఖరీదు చేసే వాక్యూమ్ క్లీనర్ ఉంది. దీని ఆ రాత్రంతా దొంగతనం చేస్తున్నంత బాధ! నిద్రపట్టలేదు. మా అన్నయ్యకి ఫోన్ చేసి పిలిపించింది.

"ఎలాగైనా ఇది పోగొట్టుకున్న అబ్బాయిని పిలిచి, ఇది ఇచ్చెయ్యాలిరా, పాపం ఎంత బాధపడుతున్నాడో?" అంది.

వాడు దాన్ని పరీక్ష చేసి చూసి "హాయిగా వాడుకో లేదా, నేను అమ్మి పెడతాను. వీడి అడ్రెసూ అదీ దానిమీద ఎక్కడా లేదు!" అన్నాడు.

ఆ మాటకి అది నోరు నొక్కేసుకుని, టపటపా లెంపలు వేసుకుని "తప్పురా.. పాపం!" అంది.

ఏ ఆధారం లేని ఆ సొత్తు అసలు యజమానికి ఎలా అందచేయాలి అన్న విషయం కన్నా, మా అక్కయ్యని ఏడిపించడమే ఎక్కువ ఇంట్రెస్టు మా అన్నయ్యకి. "ఇది నువ్వు సిన్సియర్‌గా రిటర్న్ చేస్తే, ఆ ప్యాకెట్‌లో ఇంకా లక్షరూపాయల క్యాష్ ఉంది అంటేనో?" అంటూ ఇలా రకరకాలుగా దాన్ని హింసించి, చివరికి "సర్లే నేను చూస్తా వర్రీ అవకు" అని వెళ్ళిపోయాడు. అక్కడినుండి మా అక్కయ్య బాధ వర్ణనాతీతం! పరాయి సొత్తు ఇంట్లో ఉందని దీనికి నిద్రపట్టదు. చివరికి ఓ రోజు మా అన్నయ్య ఫోన్ చేసి "ఆ కుర్రాడిని పట్టాను. వస్తాడు, ఇచ్చెయ్" అన్నాడు. ఇది చాలా సంతోషంగా ఎదురు చూసింది.

ఆ అబ్బాయొచ్చాడు. ఇది జ్యూస్ ఇచ్చి, మంచినీళ్ళిచ్చి ఆ బ్యాగ్ అతనికి అందించింది. అతను థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు.

తరువాత మా అన్నయ్య ఫోన్ చేసి "ఇచ్చావా?" అన్నాడు.

"ఇచ్చాను" అంది.

"వాడు నా ఫ్రెండ్... ఆరువేలకి దాన్ని కొన్నాడు" అన్నాడు. అది కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"జోక్ చేసానే, నిజంకాదు..." అని ఎంత చెప్పినా నమ్మలేదు.

ఇలాంటి మొహమాటాలూ, మంచితనాలూ మనుషుల్లో ఈ మధ్య కరువైపోతున్నాయి. ఒకవేళ ఉన్నా చుట్టుపక్కల మనుషులు ఆట పట్టించేస్తారు. మొన్న ఊటీ వెళ్ళివస్తుంటే సర్వేశ్వర్రావు, రాఘవేంద్రరావు అని ఇద్దరు స్నేహితులు మా కంపార్ట్‌మెంట్లో తగిలారు. ఇద్దరూ రిటైరైయి అరవైఏళ్ళు పై బడ్డ వాళ్ళే. వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడు కూడా మాతోనే ప్రయాణం చేసారు.

రాత్రి సర్వేశ్వరరావు వచ్చి మా కంపార్ట్‌మెంట్లో టాయ్‌లెట్స్ పక్కన కూర్చుని కనిపించాడు. నేను చూసి,"ఇక్కడ కూర్చున్నారేవిటి?" అని అడిగాను. వాళ్ళు ఫస్ట్ క్లాస్ ఏ.సీ కంపార్ట్‌మెంట్లో రానూపోనూ ఎమ్.ఎల్.ఏ కోటాలో బుక్ చేసుకోవడం నాకు తెలుసు. లయన్స్ క్లబ్ మీటింగ్‌కి వెళ్ళొస్తున్నారు.

సర్వేశ్వరరావు నేనీ ప్రశ్న వేయగానే ఏడ్చినంత పని చేసి "అంతా మా దోస్త్ వల్ల.. వాడంటే! ఎవరో ఇద్దరు లేడీస్‌కి నా బెర్త్ ఇచ్చేసాడు" అన్నాడు.

"అదేవిటి మీ బెర్త్ ఇచ్చెయ్యడం?" అని నేను తెల్లబోయాను.

"నన్ను టీ.సి.ని పట్టుకుని ఎలాగైనా వాళ్ళకి బెర్త్ చూడమన్నాడు. చంటిపిల్లతో ఉన్నారు. మనం లయన్స్ మెంబర్స్మి. ఇంతకూడా చెయ్యకపోతే ఎలా? అని నన్ను ఇక్కడికి తరిమాడు. టీ.సీ గుంటూర్లో చూద్దాం అంటున్నాడు. అందుకే ఇక్కడ కూర్చున్నా" అన్నాడు. గుంటూరు తెల్లారాకా వస్తుంది!

"ఇంత దాన కర్ణుడు మీ ఫ్రెండ్. తన బెర్త్ ఇవ్వలేకపోయాడా?" అంటే,

"నిద్రవస్తోందిట. పడుకున్నాడు" అని జవాబు చెప్పాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది. చక్కగా రిజర్వేషన్ చేయించుకున్న మనిషి ఇలా లేవ్రేటీ పక్కన పడిగాపులు పడడం ఏమిటి? ఆ స్నేహితుడు ఇతని బెర్త్ దానం చెయ్యడం ఏవిటీ? అసలు ఆ స్త్రీలు అంత ధైర్యంగా రిజర్వేషన్ లేకుండా వీళ్ళ కంపార్ట్మెంట్లోకి ఎక్కడం ఏవిటీ?.. నేను నడుంకి కొంగు బిగించి "నేను చూస్తానుండండి" అని వెళ్ళాను. ఈలోగా సర్వేశ్వరరావు ఇంకొన్ని డీటైల్స్ ఇచ్చాడు. ఆ స్త్రీ ఈయన్ని "షటప్.. గెట్ అవుట్" అని ఆంగ్లంలో మర్యాద చేసారుట! నా స్త్రీ హృదయం కరిగిపోయింది.

"వెళ్ళమ్మా... వాడ్ని నాలుగూ దులిపెయ్" అని నన్ను బతిమాలాడు.

నేను వెళ్ళి హాయిగా శేషతల్పశాయిలాగా పవళించిన రాఘవేంద్రరావుగారినీ, పక్కన పడుకున్న ఇద్దరు స్త్రీలని చూసి, "ఇదేమైనా బావుందా? మీరు హాయిగా పడుకుని, మీ మిత్రుణ్ణి రాత్రంతా జాగరణ చేయిస్తారా?" అని నాదైన భాషలో అడిగేసాను.

రాఘవేంద్రరావు చిరునవ్వు నవ్వారు. తరువాత ప్రహసనం చాలా బావుంటుంది. సర్వేశ్వరరావుతో బాటు రాఘవేంద్రరావు కూడా మా కంపార్ట్ మెంట్కి వచ్చేసారు. "వీడు టెన్త్ క్లాస్లో నా దగ్గర కాపీ కొట్టి పాసయ్యాడమ్మా.. చిన్నప్పుడోసారి మా తోటలో జామకాయలు దొంగతనం చేసాడు. వీడు ధర్మం న్యాయం గురించి మాట్లాడడం ఏవిటీ?" అంటాడు రాఘవేంద్రరావు.

"వీడి భార్య దేవత కాబట్టి వీడిని భరిస్తోంది.. అన్నీ ఇలాంటి పనులే, మాట్లాడితే నా కంటే పెద్దవాడిని అంటాడు. ఇంత చేసి నెలరోజులు పెద్దవాడు" అంటాడు సర్వేశ్వరరావు. మొత్తం కంపార్ట్మెంట్లో అందరికీ వినోదం వీళ్ళ బాల్యం సంగతులు. కలిసి ప్రయాణం చేస్తున్న ఆ ఇద్దరు స్నేహితులూ.. బాల్యం నుండీ సహ ప్రయాణం చేస్తూనే ఉన్నారు. అరవై ఏళ్ళు పైపడి చిన్నపిల్లల్లా పోట్లాడుకుంటున్నారు. కారణం... ఇద్దరు స్త్రీలు రిజర్వేషన్ లేకుండా ఫస్ట్క్లాసు కంపార్ట్మెంట్లోకి అర్ధరాత్రి ఎక్కితే, తమ బెర్త్ ఇచ్చి మా దగ్గర ఎడ్జస్ట్ అయ్యారు. ఎంత మానవత్వం? మొహం చిన్నపిల్లాడిలా పెట్టుకుని కూర్చున్న సర్వేశ్వరరావుది ఎంత మొహమాటం?

ఇంక మా అక్క మొహమాటానికి పరాకాష్టగా ఒక ఉదాహరణ చెప్పి ముగిస్తాను. కడుపులో పాడ్ పెట్టి నర్స్ మరిచిపోతే, పదిరోజులు కడుపు నెప్పితో నరకం పడింది. చివరికి ఇదీ విషయం అని తెలిసి వెళ్ళి అడిగితే ఆ నర్స్ రెండు చేతులూ పట్టుకుని "సారీ.. ఎవరికీ చెప్పొద్దు. ఆ రోజు నుండీ ఈ విషయం గుర్తొచ్చినప్పుడల్లా దేవుడ్ని ప్రార్థిస్తూనే ఉన్నా" అందట.

అందుకే అది నోరు మూసుకుని ఆపరేషన్కి సిద్ధం అయింది కానీ నర్సు పేరు బయట పెట్టలేదు!

మన చుట్టూ చాలా మంది మొహమాటస్తులుంటారు! వారి మొహమాటాన్ని అలుసుగా తీసుకోవద్దు.. అర్థం చేసుకుని వారు ఇబ్బంది పడకుండా చూసుకుందాం! ఎందుకంటే అరిస్టాటిల్ అన్నట్లు "మేన్ ఈజ్ ఏ సోషల్ ఏనిమల్..." మనం జనం లేకుండా బ్రతకలేం.

**దారమ్మట మనం మానవత్వం విత్తనాలు చల్లుకుంటూపోతే.. తిరిగి వచ్చేటప్పుడు అవి తియ్యని ఫలాలతో ఎదురు చూస్తుంటాయి!**

ఈ చివరి వాక్యం ఆధారంగా చక్కటి కథను అల్లి, సంభాషణలు కూడా వ్రాసిన మన రచయిత్రి రమణి గారి సినిమా ‘***అందరి బంధువయా***‘ విజయవంతం కావాలని మనసారా ఆశిద్దాం - ఎడిటర్

